16

# శ్రీశేషుదేవుల పరిశుద్ధ బాల్యము

స్వచ్ఛముగా, పరిశుభ్రముగా ఉన్న అద్దములో ప్రతిబింబము పూర్తి స్పష్టముగా గోచరిస్తుందేగానీ మురికి పట్టిన అద్దములో అయితే స్పష్టముగా గోచరించదు. శ్రీ శేషబాబు గారి అంతఃకరణము చిన్ననాటి నుండి నీతి, నిజాయితీలతో నిష్కపటముగా, పరిశుద్ధముగా ఉండేది. బాల్య చాపల్యముతో గానీ, అవసరానికి గానీ ఎన్నడూ అబద్ధము పలికేవారు కాదు. తన మాటలవలన గానీ, తన చేతలవలన గానీ ఎదుటి వారికి బాధ కలిగించరాదని ఎప్పుడూ అప్రమత్తత వహించేవారు. బాల్యసహజ చాపల్యములుగానీ, యౌవ్వనారంభములో ప్రవేశించే దుర్వ్యసనములు గానీ ఆయన ఏ మాత్రము ఎరుగరు. యౌవ్వనారంభములో ప్రతి వ్యక్తిలోను పొడసూపే కామ వికారములను ఆయన అణుమాత్రమైనా ఎరుగరు. 1973లో ఇరవై ఏళ్ళ వయసులో డిగ్రీ చదువుచున్న సమయానికి కూడా ఆయనకు వీర్యము తెలుపురంగులో ఉంటుందనే విషయాన్ని కూడా ఎరుగనంతటి అస్ఖలిత బ్రహ్మచారిగానే శ్రీ శేషబాబు గారు జీవించెడివారు. 1973 లోనే ఒక స్నేహితుడు ఆయనను గురువుగా భావించి, తనలోని మానసిక వ్యభిచార భావములను, వావి వరసలు లేకుండా కలిగే కామ తలంపులను ఆయన వద్ద బాప్తిస్మముగ చెప్పే వరకు, మనుష్యులలో ఆ విధమైన కామయోచనలు కలుగుతాయనే విషయమే ఆయనకు తెలియదు. దానిని బట్టి శ్రీ శేషబాబుగారు మనో, వాక్, కర్మలలో సంపూర్ణముగా పరిశుద్ధతనే ఇష్టపడే వారని పరిశుద్ధముగానే జీవించే వారని మనం అర్ధము చేసుకోవచ్చు.

శ్రీ శేషబాబు గారి ప్రవర్తన చిన్నతనము నుండి ఇంట్లోని అందరికంటే భిన్నముగా కనిపించేది. చిన్నతనము నుండి సత్వగుణ ప్రధానునిగనే ఆయన మసలెడివారు. ఒకరికి సంబంధించిన మాటలు ఇంకొకరివద్ద ఎన్నడూ మాట్లాడేవారు కాదు. ఎవరిని గూర్చియు వారి పరోక్షముగా చెడుగా మాట్లాడుట గానీ విమర్శించుట గానీ ఎన్నడూ చేసేవారు కాదు. ఎవరినీ నొప్పించేలా ఎప్పుడూ మాట్లాడేవారు కాదు. బాల్యచాపల్యము కొద్దీ అల్లరి చిల్లరగా తిరుగుట వంటివెప్పుడూ చేసేవారు కాదు. వీధిలోని పిల్లలతో గోళీలాడుట, బంతాటలాడుట వంటివి కూడా చేసేవారు కాదు. వీధిలో ఎవరితోను గొడవలు పడుట గానీ, పిల్లలెవ్వరితోనైనా దెబ్బలాడుట, ఇంటి మీదకు గొడవలు తీసుకు వచ్చుట వంటివి శ్రీ శేషబాబుగారు ఎన్నడూ ఎరుగరు. ఇంటికెవరైనా బంధువులు వస్తే అభిమానముగా పలకరించి, ఆదరించేవారు. చిన్నతనములోనే చదువును ఎన్నడూ నిర్లక్ష్యము చేసేవారు కాదు. ఎప్పుడైనా ఇంటికి


continue...

అవసరమైన సరుకులు బయట నుండి తెచ్చుటగానీ, చుట్టాల ఇంటికి ఏవైనా తీసుకువెళ్ళి ఇచ్చుట గానీ, పొరుగూర్లు వెళ్ళి చుట్టాలకు ఏవైనా వార్తలు చెప్పవలసి వచ్చినాగానీ తనకప్పగించిన బాధ్యతలన్నింటినీ ఎంతో క్రమపద్ధతిగా నెరవేర్చెడివారు. సైకిలు త్రొక్కుచూ పొరుగూర్లు వెళ్ళి పనులు చేసుకుని వచ్చెడివారు. సైకిలు మీద వెళుతున్నప్పుడు నడిచి వెళ్ళుచున్నవారు ఎవ్వరైనా కనిపిస్తే వారిని సైకిలుపై ఎక్కించుకుని, తను వెళ్ళే త్రోవ వరకు తీసుకువెళ్ళి దింపేవారు. సైకిలు కలిగియున్న ప్రతివ్యక్తికి, సైకిలు లేక నడిచివెళ్ళే వారి విషయంలో అట్టి సామాజిక బాధ్యత ఉంటుందని పూర్తిగా నమ్మెడి వారు, ఆచరించెడివారు. ఇంట్లో భోజన సమయములో అది కావాలి ఇది కావాలి అని ఎన్నడూ గొడవ పెట్టేవారు కాదు. ఇంట్లో ఏది వండితే అది సంతోషముగా భుజించేవారు. బట్టలుగానీ, పుస్తకాలుగానీ, ఏవైనా వస్తువులు గానీ కొనిపెట్టమని ఎన్నడూ తల్లితండ్రుల వద్ద పేచీ పెట్టేవారు కాదు. తన అన్నగార్లు చదువుకున్న పుస్తకాలనే తాను వాడుకునే వారే గానీ ఎప్పుడూ వ్యర్ధముగా గాని, ఆడంబరముగాగానీ ఖర్చు చేసేవారు కాదు. అన్నగార్లు చదువుకున్న పుస్తకాలను చాలా జాగ్రత్తగా భద్రపరచి, వాటికి అందముగా అట్టలు వేసి, స్వయముగా బైండు చేసి క్రొత్త వాటిలాగ తయారు చేసుకునేవారు. స్కూలులో ఎవరైనా పేద విద్యార్థులకు పుస్తకాలు అవసరమైనప్పుడు వారు చదువుకొనుటకై ఆ పుస్తకాలను ఇచ్చేవారు. వారి చదువు పూర్తయ్యాక ఆ పుస్తకాలు తీసుకుని తనకొరకు భద్రపరచుకునేవారు.

చిన్నతనములోనే శ్రీ శేషబాబు గారికి తన తండ్రియొక్క నీతివర్తనము గూర్చి అవగాహన ఉండేది. అంత చిన్న వయస్సులోనే ఆలోచనలలో అంతటి పరిపక్వత ఉండుట ఆశ్చర్యకరమే. తన తండ్రి ధనానికి అతీతముగా నీతికి కట్టుబడియున్నారని, ఆర్ధిక ఇబ్బందులు ఎదురైనపుడు కూడా లెక్క చేయకుండా నిరాడంబర జీవన విధానాన్నే గడుపుచూ నీతిని విడువని ఉత్తముడని ఆయన ఎరుగుదురు. తన తండ్రికి ఆర్ధికముగా ఖర్చును తగ్గించుటలో సహకరించాలనే సదుద్దేశ్యముతో చిన్నతనము నుండి నిరాడంబరముగానే ఉండేవారు. ఆహార పదార్ధాలలో కూడా తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే సాత్విక ఆహారాన్నే ఇష్టపడేవారు గానీ అధిక ఖర్చుతో తయారుచేసే ఆడంబర పదార్ధాలను ఇష్టపడేవారు కాదు.

